సాక్షి నల్లగొండ

మంగళవారం : 19 : నవంబర్ : 2024



112 కిలోల గంజాయి పట్టివేత

సూర్యాపేట, కోదాడ పరిధిలో పోలీసుల తనిఖీల్లో రూ.27.40లక్షల విలువైన 112 కేజీల గంజాయిని పట్టుకున్నారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 584.70 అడుగులు
ఇన్‌ఫ్లో	: 3,800 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 17,967 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: నిల్
కుడికాల్వ ద్వారా	: 9,900 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 5,367 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2,400
వరద కాల్వకు	: 300

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం :	644.50 అడుగులు
ఇన్‌ఫ్లో	: 67 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 376 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: నిల్
కుడికాల్వకు	: నిల్

న్యూస్‌రీల్

బాధితులకు న్యాయం చేయాలి



బాధితులు ఇచ్చిన ఫిర్యాదును పరిశీలిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం : పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరిగితేనే పోలీస్‌శాఖపై నమ్మకం కలుగుతుందని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. పోలీస్ గ్రీవెన్స్‌డే సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాదితుల వద్ద ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి.. బాధితులకు న్యాయం చేయాలని పలువురు ఎస్‌ఐలకు సూచించారు. శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ) : జిల్లా న్యాయ సేవా అధికార సంస్థలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఆ సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. టైపిస్ట్, రికార్డు అసిస్టెంట్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. డిసెంబర్ 2వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా రిజిస్టర్ పోస్టు ద్వారా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. పూర్తి వివరాలను nalgonda.dcourts.gov.in వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు తెలిపారు.

'నూరేళ్ల నా ఊరు' గేయకావ్యం విడుదల



మాట్లాడుతున్న వరంగల్ శ్రీనివాస్

రామగిరి(నల్లగొండ) : వందేళ్ల క్రితం పల్లెటూరు జీవనస్థితి గతులకు అద్దంపట్టేలా 'నూరేండ్ల నా ఊరు' గేయకావ్యం ఉంటుందని కవి, గాయకుడు వరంగల్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో 'నూరేండ్ల నా ఊరు' గేయకావ్యాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 243 చరణాలతో ఈ గేయాన్ని రూపొందించామన్నారు. ప్రస్తుత సమాజంలో మనుషుల్లో వచ్చిన మార్పులను ఈ గేయం తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో గాయకులు అంబటి వెంకన్న, వేముల పుష్ప, మద్దెల సందీప్, జాపాక శివ, గూడూరు మహేష్, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంజీయూలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

నల్లగొండ రూరల్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీలో మంగళవారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్లేస్‌మెంట్ డ్రైవ్ డైరెక్టర్ ప్రశాంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, ఏదైనా డిగ్రీ, పీజీ, బీటెక్, ఎంటెక్ ఉత్తీర్ణులైన వారు ఈ డ్రైవ్‌లో పాల్గొన వచ్చని తెలిపారు. నాన్ ఐటీ, ఫార్మసీ కంపెనీలు, బ్యాంకింగ్ సంస్థలు ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొంటాయని తెలిపారు. వివరాల కోసం 9010203857 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మాలల సింహగర్జన విజయవంతం చేయాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : డిసెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కో కన్వీనర్ తల్లమళ్ల హసేన్ కోరారు. సోమవారం నల్లగొండలోని జిల్లా పరిషత్ విశ్రాంతి భవనంలో సింహగర్జన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మాలల సింహగర్జనకు ఇంటికో మనిషి, ఊరికో వాహనం చొప్పున లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. మనువాద రాజకీయ పార్టీలు ఎస్సీలను విడదీస్తూ రిజర్వేషన్లను ఎత్తివేసేందుకు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర నాయకుడు కంచి మధుసూదన్, కో చైర్మన్ రేఖల సైదులు, బొగరి విజయ్‌కుమార్, చింతపల్లి లింగమయ్య, తెలగమల్ల యాదయ్య, న్యాయవాదులు కట్ట దుర్గాప్రసాద్, సంద యాదయ్య, ఈసారపు కృష్ణమూర్తి, అద్దంకి రామకోటి, అశోక్, గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రూప్‌-3 పరీక్షలు



నల్లగొండలోని ప్రతీక్‌రెడ్డి కాలేజీ వద్ద అభ్యర్థుల హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న పోలీసులు

నల్లగొండ : రెండు రోజులుగా కొనసాగుతున్న గ్రూప్‌-3 పరీక్షలు సోమవారంతో ముగిశాయి. ఆదివారం పేపర్‌-1, పేపర్‌-2 పరీక్షలు పూర్తి కాగా.. సోమవారం ఉదయం పేపర్‌-3 పరీక్ష నిర్వహించారు. జిల్లాలోని నల్లగొండ, మిర్యాలగూడలో ఏర్పాటు చేసిన 88 కేంద్రాల్లో నిర్వహించిన పేపర్‌-3 పరీక్షకు 28,353 మంది అభ్యర్థులకు గాను 15,257 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 13,096 మంది గైర్హాజరయ్యారు. 53.81 శాతం హాజరు నమోదైంది.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ

నల్లగొండ క్రైం : నల్లగొండలో గ్రూప్‌-3 పరీక్ష కేంద్రాలను సోమవారం ఎస్పీ శరత్ చంద్ర పవార్.. ఏఎస్పీ రాములునాయక్‌తో కలిసి పరిశీలించారు. పరీక్ష ఏర్పాట్లు, భద్రత, ఓఎంఆర్ షీట్ల తరలింపు తదితర భద్రతా అంశాలను పర్యవేక్షించారు. పట్టణంలోని కాకతీయ పీజీ కాలేజీలో జరుగుతున్న పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ డానియెల్, ఎస్‌ఐ నాగరాజు ఉన్నారు.



కాకతీయ పీజీ కళాశాల కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

బీసీలకు అన్యాయం జరగదు

వెనుకబడిన వారిని గుర్తించి ఆదుకునేందుకే సర్వే

- బీసీలు సమాజ సంపదలో వాటా కోసం పోరాడాలి
- రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్
- బీసీల సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన స్థితిగతులపై నల్లగొండలో బహిరంగ విచారణ



బీసీల స్థితిగతులపై నల్లగొండ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ విచారణలో మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, చిత్రంలో కమిషన్ సభ్యులు బాలలక్ష్మి, జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, కలెక్టర్లు ఇలా త్రిపాఠి, హనుమంతరావు, తేజస్ నందలాల్ పవార్ తదితరులు

నల్లగొండ : బీసీలకు అన్యాయం జరగకుండా చూడడం తమ బాధ్యత అని బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. సోమవారం నల్లగొండ కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో వెనుకబడిన తరగతుల సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన స్థితిగతులపై కమిషన్ ఆధ్వర్యంలో బహిరంగ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రిభువనగిరి జిల్లాలకు చెందిన బీసీ నాయకులు, కుల సంఘాల సభ్యుల నుంచి వినతిపత్రాలు స్వీకరించడంతో పాటు వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. మూడు జిల్లాల కలెక్టర్లతో పాటు పోలీస్ అధికారులు కూడా ఈ విచారణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ నిరంజన్ మాట్లాడుతూ బీసీలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోమన్నారు. ప్రస్తుతం చేపట్టిన సర్వే ద్వారా వారి పరిస్థితి తెలుసుకుని న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. బీసీలు సమాజ సంపదలో వాటా కోసం పోరాడాలని విజ్ఞప్తి చేశారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బీసీ స్థితిగతులు తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేపడుతోందన్నారు. బీసీల్లోని చాలా కులాలు ఇంకా వివక్షకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ బీసీ కమిషన్ బహిరంగ విచారణకు ప్రత్యేకించి అఫిడవిట్ ఏర్పాటు చేయడంతోపాటు జిరాక్స్, ఇతర సౌకర్యాలను కల్పించామన్నారు. సమావేశంలో బీసీ కమిషన్ సభ్యులు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మి మాట్లాడారు. భువనగిరి కలెక్టర్ హనుమంతరావు, సూర్యాపేట కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన బీసీ సంఘాల నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు

సమావేశంలో వెల్లడైన అభిప్రాయాలు ఇలా..

- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు మాట్లాడుతూ సమగ్ర కులగణన పక్కాగా జరగాలని కోరారు. స్థానిక సంస్థల్లో ఏబీసీడీ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతున్నారని ఆ విధంగా చర్యలు తీసుకోవాలని కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై సమీక్షించాలని సూచించారు.
- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ మాట్లాడుతూ క్రీమీలేయర్ విధానాన్ని తొలగించాలని కోరారు.
- విశ్వబ్రాహ్మణ సంఘం నాయకుడు విశ్వనాథం మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ, వడ్రంగి తదితర కులాలన్నింటినీ ఒకే కులం కింద చూపాలని కోరారు.
- గంగపుత్ర సంఘం నాయకుడు మునాస ప్రసన్న మాట్లాడుతూ గంగపుత్ర, బేస్త, చేపలు పట్టే కులస్తులందరనీ ఒకే సామాజిక వర్గంగా గుర్తించాలని కోరారు.
- బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం, బీసీ కార్పొరేషన్లు ఏకం కావడం వల్ల అన్యాయం జరుగుతోందన్నారు. బీసీలోని కొన్ని కులాలకే పెన్షన్ ఇస్తున్నారని మిగతా కులాలకు కూడా ఇవ్వాలని కోరారు.
- రజక సంఘం నాయకుడు కొండూరు సత్యనారాయణ మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో బీసీలకు ఏబీసీడీ పద్ధతిన ప్రాతినిధ్యం కల్పిస్తేనే న్యాయం జరుగుతుందనన్నారు.

నాయీ బ్రాహ్మణులను ఉద్యోగులుగా గుర్తించాలి

నాయీ బ్రాహ్మణ సంఘం నాయకుడు నేలపట్ల రమేష్ మాట్లాడుతూ దేవాలయాల్లో తల నీలాలు తీసే నాయీ బ్రాహ్మణులను ఉద్యోగులుగా గుర్తించడం లేదన్నారు. క్షౌరాలు చేసే సమయంలో అంటు వ్యాధులు వచ్చి చనిపోతున్నారని.. చనిపోతే దేవాలయం తరఫున దండ వేసే పరిస్థితి కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన చైర్మన్ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి రాతపూర్వకంగా తీసుకుపోయి ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు గౌరవం దక్కే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సన్నాలు మిల్లులకే..

ప్రభుత్వ కేంద్రాల్లో ఇప్పటివరకు కొన్నది 783 మెట్రిక్ టన్నులే..

- 17 శాతం తేమ.. ఇతర కారణాలతో మిల్లుల వైపే మొగ్గు
- రూ.500 బోనస్‌కు దూరమవుతున్న రైతులు



మిర్యాలగూడలోని మిల్లు వద్ద ధాన్యం ట్రాక్టర్లు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : సన్న రకం ధాన్యం పెద్ద మొత్తంలో మిల్లులకు తరలివెళ్తోంది. ప్రభుత్వం ఎప్పుడూ లేని విధంగా ఈసారి సన్నాలకు రూ.500 బోనస్ ప్రకటించింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయిస్తే బోనస్ దక్కుతుంది. అందుకు ధాన్యంలో 17 శాతం తేమ ఉండాలి. ఆ తేమ శాతం రావాలంటే రైతులు రోజుల తరబడి ధాన్యం ఎండబోయాలి. తూకం వేసిన తర్వాత ధాన్యం మిల్లుకు చేరేంత వరకు రైతుదే బాధ్యతే. ఇదే సందర్భంలో మిల్లుల్లో 26 శాతం తేమ ఉన్న పచ్చి ఒడ్లను కూడా కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు మిల్లు వైపే మొగ్గు చూపుతున్నారు. 17శాతం తేమ నిబంధన కారణంగా ప్రభుత్వ బోనస్‌కు రైతులు దూరమవుతున్నారు.

346 కొనుగోలు కేంద్రాలు..

జిల్లా వ్యాప్తంగా ధాన్యం ధాన్యం కొనుగోలుకు మొత్తం 346 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో దొడ్డు రకాల కొనుగోలుకు 266, సన్నాలకు 80 కేంద్రాలను ప్రారంభించారు. దొడ్డు ధాన్యం 4.70 లక్షలు మెట్రిక్ టన్నులు కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేయగా.. ఇప్పటి వరకు 1,06,254 మెట్రిక్ టన్నులు కొనుగోలు కేశారు. సన్నాలు 2,80,000 టన్నులు మార్కెట్‌కు వస్తుందని అంచనా వేయగా.. ఇప్పటివరకు కేవలం 783 టన్నులే కొనుగోలు చేశారు.

ఆయకట్టు ధాన్యం కూడా మిల్లులకే..

నాన్ ఆయకట్టు పరిధిలో మొదట కోతలు జరగడంతో మిల్లులు నడవాలంటే సన్నాలు అవసరం. రైతుల నుంచి పచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేశారు. సాగర్ ఆయకట్టులో వరి కోతలు ప్రస్తుతం ప్రారంభమయ్యాయి. సన్నాలు అధికంగా వచ్చే అవకాశం ఉంది. లక్ష మెట్రిక్ టన్నుల వరకు సన్నాలు మార్కెట్‌కు వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కానీ ఆ ధాన్యం కూడా మిల్లులకే వెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది.

17 శాతం తేమ నిబంధనతోనే..

ప్రభుత్వం దొడ్డు ధాన్యంతో పాటు సన్నాలకు కూడా 17 శాతం తేమ నిబంధన ఉంది. సన్న ధాన్యాన్ని 17 శాతం తేమ వచ్చే వరకు ఆరబెట్టాలంటే చాలా సమయం పడుతుంది. ధాన్యం తేమ వచ్చి కాంటా వేసినా.. మిల్లుకు వెళ్లేంత వరకు రైతుదే బాధ్యత. అందులోనూ హమాలీ, టార్పాలిన్ల ఖర్చు రైతు భరించాల్సి వస్తుంది. ఇవన్నీ భరిస్తూ ముందుకెళ్లినా వర్షం వచ్చి వడ్లు తడిస్తే నష్టపోవాల్సింది రైతే. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని రైతులు పచ్చి ధాన్యం కొంటున్న మిల్లర్ల వైపే మొగ్గు చూపుతున్నారు.

కలెక్టర్ ప్రత్యేక దృష్టి

కలెక్టర్ ఇలా త్రిపాఠి సన్న ధాన్యాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆయకట్టులో ఇప్పుడే కోతలు ప్రారంభమైనందున అక్కడి కేంద్రాల్లో కొనుగోళ్ల విషయంలో వేగం పెంచి రైతుకు మద్దతు ధరతో పాటు బోనస్ వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా నిత్యం జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ.. కొనుగోళ్లలో వేగం పెంచేలా చర్యలు తీసుకుంటున్నారు.

ధర తగ్గిస్తున్న మిల్లర్లు..

కోతలు ప్రారంభమైన సమయంలో సన్న ధాన్యానికి మంచి ధరే పెట్టిన మిల్లర్లు.. ఆ తర్వాత ధర తగ్గించారు. అయినా.. మిల్లుల వద్ద అమ్ముకునేందుకే మొగ్గు చూపుతున్నారు. దీంతో రైతులు మద్దతు ధరతోపాటు బోనస్ కూడా అందక నష్టపోతున్నారు. ధాన్యం అమ్మకాలపై అధికారులు దృష్టి పెట్టి.. మిల్లులకు వెళ్లి నష్టపోకుండా రైతులకు అవగాహన కల్పించి.. వారు మద్దతు ధరతోపాటు బోనస్ పొందేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు



మాడుగులపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న పౌరసరఫరాల శాఖ అధికారులు

వేములపల్లి (మాడ్గులపల్లి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా నిర్వాహకులు ఎప్పటికప్పుడు ధాన్యాన్ని కాంటా వేయాలని స్టేట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సివిల్ సప్లయ్ అధికారి, సివిల్ సప్లయ్ డీఎస్పీ, టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జ్ జి.వెంకటేశం అన్నారు. సోమవారం మాడ్గులపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడారు. తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కాంటా వేసి తరలించాలన్నారు. రైతులు సన్నరకం ధాన్యాన్ని అమ్ముకోవడానికి మిల్లుల వద్ద వెళ్లి ఇబ్బందులు పడొద్దన్నారు. నాణ్యతా ప్రమాణాలతో కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ పొందాలని సూచించారు. ఆయన వెంట సివిల్ సప్లయ్ డీటీ జావిద్, వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ, పీఏసీఎస్ సెంటర్ సీఈఓ రవీందర్‌రావు ఉన్నారు.

నేటి నుంచి 'హమారా శౌచాలయ్ హమారా సమ్మాన్'

నల్లగొండ : 'హమారా శౌచాలయ్‌-హమారా సమ్మాన్' కార్యక్రమం ఈ నెల 19 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా జిల్లా నీటి సరఫరా, పారిశుద్ధ్య కమిటీ సమావేశం జరుగనుందని తెలిపారు. డిసెంబర్ 5వ తేదీ వరకు సామూహిక మరుగుదొడ్లకు మరమ్మతులు, పునరుద్ధరణ, వ్యక్తిగత మరుగుదొడ్లకు రంగులు వేయడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 10న శుభ్రపరిచిన సామూహిక, వ్యక్తిగత మరుగుదొడ్లను గుర్తించి సంబంధిత కార్మికులకు అవార్డులు ప్రధానం చేస్తారని తెలిపారు.

సీసీఐ తీరుపై రైతుల అసహనం



రహదారిపై బారులుదీరిన రైతుల పత్తి వాహనాలు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి సమీపంలో శివగణేష్ కాటన్ మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రం తీరుపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం వరకు పత్తి రైతులు ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో తెచ్చిన పత్తిని కనీసం మ్యాచర్ కూడా చూడని నిర్వాహకులు దళారులు డీసీఎం, లారీల్లో తెచ్చిన పత్తిని మాత్రం వెంటనే కొనుగోలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. మిల్లు యజమానులు దళారులతో కుమ్మక్కై రైతులు తెచ్చిన పత్తిని పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రైతులు తెచ్చిన పత్తిని త్వరితగతిన కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పచ్చని చెట్టును కాపాడుకుంటూ..



దాబా లోపల చెట్టు కాండం



బయటకు కనిపిస్తున్న చెట్టు కొమ్మలు

మొక్కలు నాటి సంరక్షించాలని అందరూ చెబుతుంటారు. కానీ ఆచరించేవారు అరుదుగా ఉంటారు. కొందరు తాము చేపడుతున్న నిర్మాణాలకు చెట్లు అడ్డుగా ఉంటే నిర్దాక్షిణ్యంగా తొలగిస్తుంటారు. కానీ చిట్యాల పట్టణంలోని రైల్వే బ్రిడ్జి సమీపంలోని విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి వెంట గల మహేశ్వరీ దాబా యజమాని బాతుక యాదయ్య పదేళ్ల క్రితం తన సొంత స్థలంలో చెట్టును అలాగే ఉంచి దాబా ఏర్పాటు చేశాడు. చెట్టును తొలగించకుండా దాబా ఏర్పాటు చేసిన యాదయ్యను అక్కడకు వచ్చే చాలామంది అభినందిస్తున్నారు. - చిట్యాల

రైల్వే డబ్లింగ్ పనులు ప్రారంభం

- గుంటూరు–బీబీనగర్ రెండో లైన్ నిర్మాణానికి గతేడాది రూ.2,853 కోట్లు కేటాయించిన కేంద్రం
- 239 కి.మీ పరిధిలో పలు ప్యాకేజీలుగా పనుల విభజన
- ట్రాక్ వెంట మట్టి నమూనాల సేకరణ

మిర్యాలగూడ : గుంటూరు –బీబీనగర్ మధ్య రెండో రైల్వే (డబ్లింగ్) పనులు ప్రారంభమయ్యాయి. ప్రయాణికులు, సరుకు రవాణా సౌకర్యం, రైళ్ల ట్రాఫిక్ నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం ఈ లైన్ డబ్లింగ్ పనులకు గతేడాది రూ.2,853 కోట్లు కేటాయించింది. 239 కిలోమీటర్ల మేర లైన్ ఏర్పాటుకు రైల్వేశాఖ టెండర్ల ప్రక్రియ పూర్తి చేసింది. పనులను ప్యాకేజీలుగా విభజించారు. తెలంగాణ పరిధిలో 139కి.మీ, ఆంధ్రప్రదేశ్ పరిధిలో 100కి.మీ ఉంది. 25 ఏండ్ల క్రితం బీబీనగర్ నుంచి గుంటూరు వరకు సింగిల్ లైన్ ఏర్పాటు చేయగా సరుకు రవాణా, ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రెండో లైన్ నిర్మాణం తప్పనిసరి అయ్యింది. రెండో లైన్ పూర్తయితే రైళ్ల సంఖ్య పెరుగుతుంది. సమయం ఆదా అవుతుంది. ఈ మార్గంలో ఉన్న విష్ణుపురం జంక్షన్ కానుండడంతో మోటుమర్రి– జగ్గయ్యపేట, యాదాద్రి పవర్‌ప్లాంట్‌కు అనుసంధానం చేయనున్నారు.



దామరచర్ల మండలం కొండ్రపోల్ వద్ద మట్టి నమూనా సేకరిస్తున్న సిబ్బంది

రెండేళ్లలో పనులు పూర్తి చేసేలా కార్యాచరణ

డబ్లింగ్ పనుల్లో భాగంగా ట్రాక్ వెంట కంపచెట్లను తొలగించారు. వంతెనలు, అండర్‌పాస్‌లు నిర్మించేందుకు వీలుగా మట్టి నమూనాలు సేకరిస్తున్నారు. రెండు వరుసలకు గతంలోనే భూసేకరణ జరగగా తాజాగా నిర్వహించిన సర్వేలో మరికొంత భూమి అవసరం ఉన్నట్లు గుర్తించారు. నల్లగొండ, యాదాద్రి జిల్లాలో భూమి కోసం రెవెన్యూ అధికారులు ప్రకటన జారీ చేశారు. మాడ్గులపల్లి, మిర్యాలగూడ, దామరచర్ల మండలాల పరిధిలోని 14 ఎకరాల భూమిని సేకరించనున్నారు. రెండేండ్లలో పనులు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మార్గంలో మిర్యాలగూడ, నల్లగొండ, చిట్యాల, రామన్నపేట, బీబీనగర్ ప్రాంతాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతోపాటు ప్రయాణికులకు రైలు ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారనుంది.

క్లుప్తంగా

కారు ఢీకొని టీవీఎస్ మోపెడ్ దగ్ధం

● ఒకరికి గాయాలు



దగ్ధమవుతున్న టీవీఎస్ మోపెడ్

చౌటుప్పల్ రూరల్: టీవీఎస్ మోపెడ్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో దగ్ధమైంది. ఈ ఘటన చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామ స్టేజీ వద్ద సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం గుండ్రాంపల్లికి చెందిన కల్లెం భిక్షం(55) కొంతకాలంగా చౌటుప్పల్‌లో నివాసముంటూ పంతంగి గ్రామ స్టేజీ వద్ద ఉన్న ఓ వెంచర్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం చౌటుప్పల్ నుంచి వెంచర్ వద్దకు టీవీఎస్ మోపెడ్‌పై వెళ్తుండగా.. పంతంగి గ్రామ స్టేజీ వద్దకు రాగానే వెనుక నుంచి హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో టీవీఎస్ మోపెడ్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. భిక్షం కాలుకు తీవ్ర గాయమైంది. వెంటనే టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం భిక్షంను చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ మన్మథకుమార్ తెలిపారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య



మౌనిక (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్: ఇంట్లో ఉరేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో సోమవారం జరిగింది. వన్ టౌన్ సీఐ కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామానికి చెందిన మౌనిక(31) కొద్దిరోజులుగా తన భర్త రమేష్‌కు దూరంగా ఉంటూ తన ఇద్దరు పిల్లలతో కలిసి మిర్యాలగూడ పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో అద్దె ఇంట్లో నివసిస్తోంది. కాగా సోమవారం ఆమె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి మేనమామ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

గుంతలో పడిన గేదె.. జేసీబీతో వెలికితీత



గుంతలో పడిన గేదె

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఎస్వీ కాంప్లెక్స్ వెనుక వైపు మురుగు నిల్వ కోసం గూనలతో ఏర్పాటు చేసిన గుంతపై మూత లేకపోవడంతో సోమవారం రాత్రి అందులో ఓ గేదె పడింది. సమాచారం తెలుసుకున్న గేదె యజమాని జేసీబీ సాయంతో గేదెను బయటికి తీయించాడు. గుంతను పూడ్చి మున్ముందు ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

112 కిలోల గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్, చిత్రంలో పోలీసు అధికారులు

- వేర్వేరుగా గంజాయి తరలిస్తున్న ఏడుగురి అరెస్ట్
- 3 కార్లు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేటటౌన్: వేర్వేరుగా గంజాయి తరలిస్తున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.27.40లక్షల విలువైన 112 కేజీల గంజాయి, 3 కార్లు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ విలేకరులకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని రాజీవ్‌గాంధీ పార్కు వద్ద హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. రెండు కార్లలో వస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మోహనకృష్ణ, కోరా అచ్యుత్‌రాజు, షేక్ ఖాసీం, బొమ్మగాని శ్రీకాంత్‌గౌడ్, కర్ణాటకకు చెందిన విజయ్ కుమార్, మౌలాలీ పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. వారిని పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. రెండు కార్లలో గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకొని 75 కిలోల గంజాయి 8 సెల్‌ఫోన్లు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు మహారాష్ట్రకు చెందిన మీరగానే ప్రభాకర్ కారును ఆపి తనిఖీ చేయగా 37.46 కిలోల గంజాయి లభ్యమైంది. అతడి వద్ద నుంచి గంజాయి, కారు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. వీరంతా జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్టు ఎస్పీ పేర్కొన్నారు. నిందితులను పట్టుకున్న డీఎస్పీలు రవి, మట్టయ్య, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ఎస్‌ఐలు, సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డు అందజేశారు.

రేషన్ బియ్యం నిల్వ చేసిన ఇద్దరిపై పీడీ యాక్ట్..

రేషన్ బియ్యంతో అక్రమంగా వ్యాపారం చేస్తున్న ఇద్దరిపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జూలై నెలలో రేషన్ బియ్యం అక్రమంగా రవాణా తరలిస్తున్న, అక్రమంగా నిల్వ చేసిన 14 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. ఆయా కేసుల్లో కేసులో 32.5 టన్నుల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. వీరిలో ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా వత్సవాయి మండలం లింగాల గ్రామానికి చెందిన పసుపుల నర్సింహారావు, ఖమ్మం పట్టణానికి చెందిన ఆత్మకూరు జగదీష్ తరచూ రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి పీడీ యాక్ట్ నమోదు చేసినట్టు ఎస్పీ తెలిపారు. జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు ఇద్దరు నిందితులను హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు.

మల్లఖంబ్ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక



ఎంపిక ప్రక్రియలో భాగంగా విన్యాసాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు



విద్యార్థుల విన్యాసాలను పరిశీలిస్తున్న సెలక్షన్ కమిటీ సభ్యులు

చౌటుప్పల్: భారతదేశ పురాతన సాంప్రదాయ క్రీడ అయిన మల్లఖంబ్ పోటీలకు సంబంధించి ఉమ్మడి జిల్లా జట్లను సోమవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ట్రినిటీ హైస్కూల్‌లో ఎంపిక చేశారు. వివిధ మండలాల నుంచి వచ్చిన విద్యార్థుల ప్రదర్శన ఆధారంగా అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల్లో జట్లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ గురువారావు, ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ కేవీబీ కృష్ణారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల, పీఈటీ ఏటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. కృష్ణమూర్తి, పరిశీలకుడు వి. బిక్కు, కోచ్‌లు గోపాల్, మహేష్, సుమతి, వినోద విద్యార్థులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా జట్లకు ఎంపికైన విద్యార్థులు

అండర్-14 విభాగంలో అక్షిత, చిత్రాక్షి, వైష్ణవి, సాన్విత, మోక్షిత, సంస్కృతి, మణి, సాత్విక్, గణేష్, రాధేశ్యాం, చరణ్‌సాయి, కరణ్ ఎంపికయ్యారు. అండర్-17 విభాగంలో ఎంపికైన వారిలో లోహిత, నీరజ, సాత్విక, కీర్తి, వైష్ణవి, ప్రీతి, చరణ్య, శ్రీహర్ష, గణేష్, గణేశ్వర్, దీక్షిత్, దిలీప్, మణిదీప్ ఉన్నారు. అండర్-19 విభాగంలో సహస్ర, దిశ, జ్ఞానశ్రీ, హారిక, లాస్య, అక్షిత, హేమంత్, సాయిశశాంక్, అభినవ్, అనీష్, విశాల్, భార్గవ్ ఎంపికయ్యారు.

చెరువు కాపలాకు వెళ్లి మత్స్యకారుడు మృతి



శ్రీను (ఫైల్)

అడ్డగూడూరు: చెరువు కాపలాకు వెళ్లిన మత్స్యకారుడు నిద్రలోనే మృతి చెందాడు. ఈ ఘటన అడ్డగూడూరు మండలం అజీంపేట గ్రామంలో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అజీంపేట గ్రామానికి చెందిన మల్లబోయిన శ్రీను(49) రోజుమాదిరిగానే శుక్రవారం రాత్రి 9గంటల సమయంలో గ్రామ పరిధిలోని చెరువు వద్దకు కాపలాకు వెళ్లి అక్కడే నిద్రించాడు. మరుసటి రోజు ఉదయం 5గంటల సమయంలో శ్రీనుతో పాటు చెరువు కాపలాకు వెళ్లిన మాదాసు వెంకన్న, నరసింహ అతడిని నిద్ర లేపేందుకు యత్నించగా.. ఎంతకూ లేవకపోవడంతో అప్పటికే మృతిచెందాడని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి ధనమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

యాదగిరీశుడి సన్నిధిలో ఇటలీ దేశస్తులు



యాదగిరి క్షేత్రంలో ఇటలీకి చెందిన హైన్రీకా, జీజీ

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని సోమవారం రాత్రి ఇటలీ దేశానికి చెందిన జీజీ, హెన్రికా దర్శించుకొన్నారు. ఆలయ సన్నిధిలో జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. భరత నాట్యం, కూచిపూడి నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయని జీజీ, హెన్రీకా వెల్లడించారు. సంప్రదాయ నృత్యాలు తమకు ఎంతో ఇష్టమని, భారతీయ సంస్కృతిలో ఎంతో ఆధ్యాత్మిక దాగి ఉందని పేర్కొన్నారు. అనంతరం నృత్య కళాకారులతో కలిసి ఫొటోలు దిగి ఆనందం వ్యక్తం చేశారు.

● నిరుపయోగంగా గదులు



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ సన్నిధిలో భక్తుల కోసం నిర్మించిన గదులను గతేడాది నుంచి అద్దెకు ఇవ్వకపోవడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో ఆ గదులు శిథిలావస్థకు చేరుతాయేమోనని స్థానికులు, భక్తులు అంటున్నారు. నిరుపయోగంగా ఉన్న గదుల వద్ద యాచకులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులు ఆరుబయటే ఉంటూ అపరిశుభ్రంగా మార్చుతున్నారు. ఆలయ అధికారులు స్పందించి గదులను అద్దెకు ఇవ్వాలని భక్తులు కోరుతున్నారు. – యాదగిరిగుట్ట

విద్యార్థిని చదువుకు ఆర్థిక సాయం అందజేత



సాత్వికకు ఆర్థికసాయం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి

చిట్యాల: పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బెల్లపు ప్రవీణ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో డిగ్రీ చదువుతున్న ఆయన కుమార్తె స్వాతిక కళాశాల ఫీజు కట్టేందుకు ఇబ్బందులు పడుతోంది. విషయం తెలుసుకున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం రూ.30వేలను సోమవారం చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి ద్వారా స్వాతికకు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జడల చినమల్లయ్య, కనకదుర్గ ఆలయ చైర్మన్ మారగోని ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ ఎద్దులపురి కృష్ణ, మాజీ వార్డు సభ్యుడు చెర్కుపల్లి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

అలరించిన వీరబ్రహ్మేంద్ర స్వామి నాటకం



నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని విశ్వకర్మ భవనంలో విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నాటక ప్రదర్శన నిర్వహించారు. నార్కట్‌పల్లికి చెందిన విజయ నాటక సమాజం ఆధ్వర్యంలో ఈ నాటక ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణ కౌండిన్య పాల్గొని మాట్లాడుతూ.. బ్రహ్మంగారు చేసిన అద్భుతాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాగర్ల సత్తయ్య, రాచకొండ గిరి, కోమటి మధుసూదన్, విశ్వ బ్రాహ్మణ సేవా సంస్థ గౌరవ అధ్యక్షుడు కొండోజు కృష్ణచారి, ఉపాధ్యక్షుడు శ్రీపాద కృష్ణమాచారి, దాసోజు బ్రహ్మచారి, దాసోజు యాదగిరి, కన్నెకంటి సత్యం, పందినపల్లి బ్రహ్మచారి, పర్వతం నరేంద్రబాబు, పగిడిమర్రి వెంకటాచారి, రాఘవచారి, కూరెళ్ల వెంకటేశ్వర్లు, జగన్నాథం, చొల్లేటి లక్ష్మణ్, దాసోజు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో కొనసాగుతున్న భక్తుల రద్దీ



యాదగిరిగుట్ట: సత్యనారాయణస్వామి వ్రతాలు చేయిస్తున్న భక్తులు

యాదగిరిగుట్ట: కార్తీక మాసంలో శివుడికి ఇష్టమైన రోజు సోమవారం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు యాదగిరీశుడి క్షేత్రానికి భారీగా తరలివచ్చారు. కొండ కింద వ్రత మండపంలో సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించిన భక్తులు కొండ పైన లక్ష్మీనరసింహస్వామిని, పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తులు అధికంగా రావడంతో స్వామి వారి ధర్మదర్శనానికి రెండు గంటలకు పైగా సమయం పట్టింది. వివిధ పూజలతో నిత్యాదాయం రూ.33,03,170 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

కృష్ణానదికి దీపాలతో హారతి..



మట్టపల్లి వద్ద కృష్ణానదికి హారతిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం వద్ద కృష్ణానదికి కార్తీక మాసంలో భాగంగా సోమవారం సాయంత్రం అర్చకులు దీపాలతో హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకీలో నది ఒడ్డున ప్రహ్లాద స్నాన ఘట్టానికి తరలించారు. అనంతరం నదికి హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లి రావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు భక్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై రైతులకు అవగాహన



దూపహాడ్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న మల్లారెడ్డి యూనివర్సిటీ విద్యార్థినులు

పెన్‌పహాడ్: గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ శిక్షణ పొందుతున్న హైదరాబాద్‌లోని మల్లారెడ్డి యూనివర్సిటీకి చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థినులు సోమవారం పెన్‌పహాడ్ మండలం దూపహాడ్ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు వరి ధాన్యం కొనుగోళ్లు, కనీస మద్దతు ధర గురించి రైతులకు అవగాహన కల్పించారు. గ్రేడ్-ఏ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2320, సాధారణ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2300 మద్దతు ధర లభిస్తున్నట్లు రైతులకు వివరించారు. తేమ శాతం 17శాతం ఉండాలని తెలిపారు. ప్రతి సీజన్‌కి ధాన్యాన్ని కొనుగోలు చేసి నారు పోయాల్సిన అవసరం లేదని.. చీడపీడలు ఆశించకుండా వరి ధాన్యం పండించి అదే ధాన్యాన్ని మరొక సీజన్‌కి వాడుకోవచ్చని రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో రైతులు సైదులు, కోట బొర్రమ్మ, లచ్చమ్మ, దుర్గమ్మ, శ్రీనివాస్, నవీన్, విద్యార్థినులు ఐశ్వర్య, అక్షయ్య, అక్షిత, అమూల్య, భావన, భవాని, భవ్య, దీక్షిత, దీప్తి ప్రియ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో భవన నిర్మాణ కార్మికుడికి గాయాలు

హుజూర్‌నగర్: పని ప్రదేశంలో విద్యుదాఘాతానికి గురై భవన నిర్మాణ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన హుజూర్‌నగర్ పట్టణంలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణంలోని ఇందిరాచౌక్ సమీపంలో భవన నిర్మాణ కార్మికుడు ప్రేమ్‌సింగ్ ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా.. ప్రమాదవశాత్తు ఇనుప నిచ్చెన విద్యుత్ తీగలకు తాకడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. అతడ చేతికి, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గమనించిన స్థానికులు అతడిని హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కారును ఢీకొట్టిన డీసీఎం.. ముగ్గురికి గాయాలు

చివ్వెంల(సూర్యాపేట): జాతీయ రహదారిపై అతివేగంగా వస్తున్న డీసీఎం కారును ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై చివ్వెంల మండలం గుంజలూరు గ్రామ స్టేజీ వద్ద సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణానికి చెందిన యాసాల లక్ష్మి, యాసాల కమలాకర్, నాగులవంచ పూలమ్మ నకిరేకల్‌లో ఉంటున్న తమ బంధువుల ఇంటికి కారులో వెళ్లి తిరిగి కోదాడకు వస్తున్నారు. మార్గమధ్యలో చివ్వెంల మండలం గుంజలూరు గ్రామ స్టేజీ వద్దకు రాగానే హైదరాబాద్ నుంచి వియయవాడ వైపు అతివేగంగా వెళ్తున్న డీసీఎం వెనుక నుంచి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న లక్ష్మి, కమలాకర్, పూలమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు.

మినుము సాగుకు అనువైన సమయమిదే

● నడిగూడెం మండల వ్యవసాయాధికారి దేవప్రసాద్ సూచన

పాడి-పంట

నడిగూడెం: ప్రస్తుత రబీ సీజన్‌లో మినుము పంట సాగు చేసి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పొందవచ్చని నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాయపు దేవప్రసాద్ చెబుతున్నారు. మినుము సాగుకు సంబంధించి ఆయన సలహాలు, సూచనలు..

పంట కాలం: ప్రస్తుత నవంబర్‌తో పాటు డిసెంబర్ నెలలో కూడా మినుము పంట సాగు చేసుకోవచ్చు.

రబీకి అనువైన రకాలు: ఎల్‌బిజి-752, ఎల్‌బిజి-20, ఎల్‌బిజి-648, ఎల్‌బిజి-685, ఎల్‌బిజి-402, పిబిజి-107 రకాలు అనుకూలం.

విత్తన మోతాదు: మెట్ట అయితే 8-10 కిలోలు, మాగాణిలో అయితే 16 కిలోల విత్తనం సరిపోతుంది. మాగాణిలో నేరుగా వెదజల్లుకోవచ్చు. మెట్ట అయితే వరుసకు వరుసకు మధ్య 30 సెం.మీ., మొక్కకు మొక్కకు మధ్య 10 సెం.మీ. ఉండే విధంగా విత్తుకోవాలి.



మినుము పంట

విత్తనశుద్ధి: విత్తనాలను బీజామృతంతో లేదా రైజోబియంతో శుద్ధి చేసి విత్తుకోవచ్చు.

పోషక యాజమాన్యం: ఆఖరి దుక్కిలో 5 టన్నులు పశువుల ఎరువు వేసి కలియదున్నాలి. ఎకరానికి నాడెపు కంపోస్ట్ 25క్వింటాళ్లు, 125 కిలోల ఘన జీవామృతం పొలంలో వేయాలి. మంచి దిగుబడుల కోసం పూత సమయం నుంచి 15 రోజుల వ్యవధిలో 3 శాతం పంచగ పిచికారీ చేయాలి.

నీటి యాజమాన్యం: వర్షాభావ పరిస్థితి లేనప్పుడు ఒకటి, రెండు తడులు ఇవ్వాలి. వరి మాగాణుల్లో ఒక నీటి తడి ఇవ్వవచ్చు. ఒకటి-రెండు తడులు, 30 రోజుల లోపు, 55 రోజుల తర్వాత ఇస్తే అధిక దిగుబడులు పొందవచ్చు.

అంతర కృషి : మొదటి 30 రోజులు కలుపు పెరగకుండా రెండుసార్లు అంతరకృషి చేయాలి.

ఆశించే పురుగులు-నివారణ చర్యలు

1. చిత్త పురుగులు: చిత్త పురుగుల నివారణకు ఆఖరి దుక్కిలో ఎకరానికి 100 కిలోల వేప పిండి వేసి కలియదున్నాలి. విత్తనాలను బీజామృతంతో విత్తన శుద్ధి చేయాలి. పురుగు ఉధృతిని బట్టి 5శాతం వేప గింజల కషాయం ఒకసారి పిచికారీ చేయాలి.

2. కాండపు ఈగ: కాండపు ఈగ నివారణకు ఆఖరి దుక్కిలో ఎకరానికి 100 కిలోల వేప పిండి వేసి కలియదున్నాలి. పురుగు ఉధృతిని బట్టి 50 శాతం వేప గింజల కషాయం పిచికారీ చేయాలి. మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా ఎసిఫేట్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

3. తామర పురుగులు, తెల్లదోమ: తెల్లదోమ నివారణకు ఎకరానికి 10 తెలుపు రంగు పూసిన జిగురు డబ్బాలను పొలంలో అమర్చాలి. పొలంలో గట్లపైన వయ్యారిభామ, నానబాబు వంటి కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు పీకి నాశనం చేయాలి. ఒక శాతం వేప నూనె ద్రావణాన్ని (1 లీటరు వేప నూనె మరియు 100 గ్రాములు సర్ఫ్ పొడి మరియు 100 లీటర్ల నీరు) సాయంత్రం సమయంలో పంటపై పిచికారీ చేయాలి. పురుగు ఉధృతిని బట్టి మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లీటరు నీటికి పిచికారీ చేయాలి.

4. మారూక మచ్చల పురుగు: ఈ పురుగు నివారణకు ఎకరానికి 5 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేయాలి. పూత దవలో తప్పనిసరిగా వేప నూనె 5శాతం లీటరు నీటికి 5మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

5. పొగాకు లద్దెపురుగు: దీని గుడ్ల సముదాయాన్ని ఎప్పటికప్పుడు గుర్తించి ఏరి నాశనం చేయాలి. జల్లెడగా మారి పిల్ల పురుగులతో ఉన్న ఆకులను ఏరి నాశనం చేయాలి. ఎకరానికి 30,000 ట్రికోగ్రామా బదనికలను ఒక వారం వ్యవధిలో రెండు పర్యాయాలు వదలాలి. ఎకరానికి 5 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేయాలి. ఎకరానికి 10-15 పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలి. ఎన్‌పివి 250 మి.లీ. ద్రావణాన్ని చలికాలంలో ఒక వారం వ్యవధిలో రెండుసార్లు పంటపై పిచికారీ చేయాలి. 5 శాతం వేప గింజల ద్రావణం లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఆశించే తెగుళ్లు-నివారణ చర్యలు

1. బూడిద తెగులు: ఈ తెగులు ముదురు ఆకులపై బూడిద రూపంలో చిన్నచిన్న మచ్చలుగా కనబడి అవి క్రమేణా పెద్దవై ఆకుల పైన, కింది భాగాలకు మరియు కొమ్మలకు, కాయలకు వ్యాపిస్తుంది. దీని నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు లేదా కార్బండిజమ్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

2. ఎండు తెగులు: ఈ తెగులు వరి మాగాణుల్లో విత్తిన మినుముకు ఎక్కువగా ఆశించి, మొక్కల కాండం చుట్టూ బూజు ఏర్పడి ఆకులు వడలిపోతాయి. ఈ తెగులు తీవ్రత ఎక్కువైనచో మొక్కలు ఎండి చనిపోతాయి. ఈ తెగులు నివారణ యల్‌బిజి-648, 685, 752 రకాలకు ఈ తెగులును కొంతవరకు తట్టుకునే శక్తి ఉంది.